కందికి తెగులు.. రైతుకు దిగులు

- తెగుళ్ల నివారణకు అన్నదాతల అవస్థలు
- మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం


కంది పంటకు పురుగు పట్టిన దృశ్యం


పుట్లూరు సమీపంలో సాగు చేసిన కంది పంట

కంది పంట సాగు ఇలా..	
మండలం	హెక్టార్లలో
తాడిపత్రి	1,958
పుట్లూరు	958
పెద్ద పప్పూరు	450
యల్లనూరు	277

పుట్లూరు: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల కుంగదీస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు రావడంతో కంది పంటను సాగు చేసిన రైతులు దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని భావించారు. వారు ఆశించిన స్థాయిలో కంది పంట చూడటానికి కళకళలాడుతూ కనిపిస్తోంది. కానీ తెగుళ్ల బెడద రైతులను వేధిస్తోంది. కందిలో పచ్చ పురుగు, లద్దె పురుగు, మచ్చల పురుగుతో పాటు పూత దశలో గూళ్లు ఏర్పడటం వల్ల మందులు పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

భారంగా మారిన పెట్టుబడి

కంది పంటను సాగు చేసిన రైతులకు తెగుళ్ల కారణంగా పెరిగిన పెట్టుబడి భారంగా మారింది. పూత దశలో ఉన్న పంటలకు ఇప్పటికే మూడు నుంచి నాలుగు దఫాలు క్రిమిసింహారక మందులు పిచికారీ చేసినట్లు అన్నదాతలు వాపోయారు. మందులు పిచికారీ చేసినా ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదన్నారు. పుట్లూరు, తాడిపత్రి, యాడికి మండలాల్లో కంది పంట ఎక్కువగా సాగు చేశారు. తెగుళ్ల నివారణ కోసం క్రిమి సంహారక మందుల దుకాణాల వద్దకు రైతులు బారులు తీరుతున్నారు.

రాలిపోతున్న పూత, పిందె

ఇటీవల తుపాను కారణంగా పూతదశలో ఉన్న కంది పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మబ్బుల వల్ల పూత, పిందె రాలిపోవడం, తెగుళ్ల ఉధృతి పెరగడం వల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారు. పంటను కాపాడుకోవడానికి అధిక ధరలు గల క్రిమి సంహారక మందులను వినియోగించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. కంది పంటకు గతంలో రెండు, మూడు పర్యాయాలు మాత్రమే మందులను పిచికారీ చేస్తే దిగుబడి చేతికి వచ్చేదని, ప్రస్తుతం పూత దశకే నాలుగు దఫాలు మందుల పిచికారీ చేసినట్లు రైతులు చెబుతున్నారు.

తెగుళ్లను నివారించలేకపోతున్నాం



ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట చూడటానికి బాగున్నప్పటికీ పూత దశలో తెగుళ్ల బెడద అధికంగా ఉంది. ఇప్పటికే మూడు, నాలుగు సార్లు మందును పిచికారీ చేసినా ఫలితం కనబడటం లేదు. వ్యవసాయ అధికారులు చెప్పిన మందులను వాడినప్పటికీ తెగుళ్ల నివారణ కావడం లేదు. దీంతో పెట్టుబడి పెరిగిపోయి ఇబ్బందులు తప్పడం లేదు.

– వెంకటచౌదరి, బాలాపురం

రైతులకు అవగాహన కల్పించాం



కంది పంటకు మరూక మచ్చల పురుగు వ్యాపించి పూత, పిందె రాలిపోతోంది. అలాగే ఆకులు, పూత గూళ్లు కడుతున్నట్లు గమనించాం. నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 100గ్రాములు ఎకరానికి లేదా క్లోరంట్రనిలిప్రోల్ 60 ఎంఎల్ ఎకరానికి లేదా నోవాల్యూరాన్ 400 ఎంఎల్ ఎకరానికి 10 రోజుల వ్యవధిలో మందులను మార్పు చేస్తూ పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చు.

– కాత్యాయని, వ్యవసాయ అధికారి, పుట్లూరు

రైతు సమస్యలపై పోరుబాటకు తరలిరండి


మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: రైతు సమస్యలపై ఈ నెల 13న అనంతపురంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ర్యాలీకి ప్రతి ఒక్కరూ తరలిరావాలని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 13న ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయం సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు.

కౌశల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం నిర్మల్

గుంతకల్లుటౌన్: ఏపీ సైన్స్ సిటీ, విజ్ఞానభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌశల్–2024 రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ క్విజ్ పోటీలకు స్థానిక రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి జ్వాలా సందీప్ ఎంపికైనట్లు హెచ్‌ఎం నిర్మల్‌కుమార్ తెలిపారు. గత నెలలో జరిగిన జిల్లా స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన సందీప్ విజేతగా నిలిచాడన్నారు. ఈ నెల 30న విజయవాడలో జరిగే పోటీలకు ఎంపికైన సందీప్‌ను మంగళవారం హెచ్‌ఎంతో పాటు ప్రోగ్రాం కోఆర్డినేటర్ తాజున్‌బీ, ఉపాధ్యాయులు అభినందించారు.

మరుగుదొడ్లు నిర్మించుకోండి


ర్యాలీ చేస్తున్న అధికారులు, సర్పంచు

యల్లనూరు: ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సర్పంచు నారాయణస్వామి సూచించారు. మండలంలోని కూచివారిపల్లిలో మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాజాతా చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రజారెడ్డి, ఎంపీటీసీ యల్లప్పనాయుడు, నాయకుడు వేణుగోపాల్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి నర్మద, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ గోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి


గుంతకల్లులో ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీపీ మాధవి

గుంతకల్లు రూరల్/గుత్తి రూరల్/యల్లనూరు/యాడికి/పామిడి/పెద్దవడుగూరు: నెలగొండ గ్రామంలో శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ, ఎంపీపీ బీవీ మాధవి రెవెన్యూ సదస్సులో వినతిపత్రం అందజేశారు. మంగళవారం గుంతకల్లు మండలంలోని నెలగొండలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవికి ప్రజలు, రైతులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలను అందజేశారు. సర్పంచ్ భాగ్యమ్మ, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు జయరామిరెడ్డి శ్మశాన వాటిక లేక గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. అలాగే పులగుట్టపల్లి, నెలగొండ గ్రామాల మధ్య ఉన్న చెరువును ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరుతూ సీపీఎం నాయకులు అధికారులకు విన్నవించారు.

- గుత్తి మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో శ్మశాన వాటికకు స్థలాన్ని చూపాలని ప్రజలు కోరారు. గ్రామ శివారులో పొలాలకు వెళ్లే దారిలో వంతెన నిర్మించాలని రైతులు వినతి పత్రం అందజేశారు. ఆర్డీఓ శ్రీనివాసులు, సర్పంచ్ లక్ష్మీదేవి, తహసీల్దార్ ఓబిలేసు, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఏఓ ముస్తాక్ అహ్మద్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- యల్లనూరు మండలం గొడ్డుమర్రి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజా, ఆర్‌ఐ నారాయణమ్మ, మండల సర్వేయర్ షర్మిలీ, వీఆర్వో నాగముని, సర్వేయర్ రఘు, రైతులు పాల్గొన్నారు.
- యాడికి మండలంలోని నగరూరు గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.
- పామిడి మండలంలోని కండ్లపల్లి, వంకరాజుకాలువ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కే ఆదిశేషనాయుడు, స్పెషలాఫీసర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీడీఓ కే తేజోత్స్న, దేవదాయశాఖ ఏఈ క్రిష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.
- పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, ఆర్‌ఐ లహరిక, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు


పామిడి మండలం జీ కొట్టాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమ దృశ్యం

పామిడి/యాడికి: సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారులు సూచించారు. పామిడి మండలంలోని జీ కొట్టాల, కాలాపురం గ్రామాల్లో సోమవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ డీ లీనా వసుంధర వేరుశనగ పంట సాగుకు సంబంధించి సమగ్ర సస్య రక్షణపై అవగాహన కల్పించారు. రబీలో వేరుశనగ విత్తిన 40–45 రోజులకు గరిష్ట పూత దశలో రెండోసారి కలుపు తీయాలన్నారు. వేరుశనగలో పై ఆకులు పసుపు పచ్చగా మారితే ఇనుపధాతు లోపం నివారణకు ఐరన్ చెలేటెడ్ ఒక లీటర్ నీటికి ఒక గ్రాము చొప్పున పిచికారీ చేయాలన్నారు. తామర పురుగుల ఉధృతి నివారణకు లీటరు నీటికి వెట్టబుల్ సల్ఫర్ 3 గ్రాములు (లేదా) స్పిరోమెసిఫిన్ ఒక ఎంఎల్ (లేదా) డైకోఫోల్ 5 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. అలాగే రబీలో వేరుశనగ, వరి, జొన్న, మొక్కజొన్న, పప్పుశనగ పంటలకు సంబంధించి వాతావరణ ఆధారిత బీమాకు ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్‌రావ్, వీహెచ్‌ఏ చిరంజీవి, వీఎస్‌ఏ నారాయణస్వామి, ఎంపీఈఓ రామాంజనేయులు, ఇన్సూరెన్స్ కంపెనీ మర్షల్ రియాజ్, రిసికేష్, ఆయా గ్రామాల రైతులు శ్రీనివాసులు, సుంకిరెడ్డి, సంజీవరెడ్డి, నాగిరెడ్డి, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే యాడికి మండలంలోని వెంగన్నపల్లిలో గుత్తి ఏడీఏ వెంకటరాముడు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పంటల బీమా చేసుకోవడానికి ఈ నెల 15 వరకూ గడువు ఉందన్నారు. జొన్నపంటకు ఎకరాకు రూ.315, పప్పుశనగకు రూ.450 ప్రీమియం చెల్లించాలన్నారు. బ్లెట్టాక్స్ 3 గ్రాముల నీటికి కలుపుకొని పిచికారీ చేస్తే పప్పుశనగలో వేరుకుల్లు తెగుళ్లను అదుపుచేయవచ్చాన్నారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్‌బాషా, వీఏఓ త్రిపుర, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి గిరిబాబు, రైతులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో ప్రాణాలకు ముప్పు


పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పొగాకును ఏ రూపంలో వాడినా ప్రాణాలకు ముప్పు అని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కసాపురం హెల్త్ సబ్‌సెంటర్‌లో పొగాకు వినియోగం కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ మంచి ఆహారపు అలవాట్లను అలవరుచుకోవాలన్నారు. పొగాకు వినియోగం వల్ల మనిషి ఆరోగ్యం క్షీణించడంతోపాటు, పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల పరిధిలో 100 గజాలలోపు ఎవరైనా పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యాడికి కాలువకు నీరు విడుదల చేయాలి

యాడికి: యాడికి కాలువకు నీరు విడుదల చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని వేములపాడు రహదారిలో ఉన్న సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి జూటూరు రఫి ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ తాడిపత్రి నియోజక వర్గ కార్యదర్శి రంగయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటరాముడు యాదవ్ మాట్లాడుతూ యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో ఉన్న కాలువల్లో పేరుకుపోయిన కంప చెట్లు తొలగించి పూడికమట్టిని తొలగించి నీటిని విడుదల చేయాలన్నారు. ఈ కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తే యాడికి కాలువ సమీపంలో ఉన్న బోరుబావుల్లో నీటి మట్టం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వడ్డే రాముడు, నీలూరు లక్ష్మయ్య, సూర్యనారాయణ, శివన్న, బండారు రాఘవ, కుళ్లాయి రెడ్డి, ఆంజనేయులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఫసల్ బీమా సద్వినియోగం చేసుకోండి'

శింగనమల: పప్పుశనగ సాగు చేసిన రైతులు పీఎం ఫసల్ బీమా యోజన కింద ఈ నెల 15 లోపు ప్రీమియం చెల్లించాలని ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆకులేడు రైతు సేవ కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీసాగు చేసిన పప్పుశనగకు రైతులే ప్రీమియం చెల్లించాలన్నారు. కల్లూరులో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, క్వింటాళ్ల రూ.2300కు కొనుగోలు చేస్తారన్నారు. రైతులు రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రెండు, మూడు రోజుల్లో వర్షం వచ్చే సూచన ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎంపీఈఓ , రైతులు పాల్గొన్నారు.

విద్యార్థికి పాముకాటు

పెద్దవడుగూరు: మండలంలోని కడదరగుట్టపల్లిలో ఉపాధ్యాయుడి నిర్లక్ష్యంతో ఒక విద్యార్థి విష పురుగు కాటుకు గురయ్యాడు. వివరాలు.. పాఠశాలలో పదిమందిలోపు పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి ఒక ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నాడు. ఉదయం 10 గంటల ప్రాంతంలో బయట ఆడుకుంటున్న నాలుగో తరగతి విద్యార్థి గౌతమ్ కాలుకు విష పురుగు కాటు వేసింది. ఉపాధ్యాయుడు వెంటనే విద్యార్థిని తీసుకుని మిగిలిన వారిని బయటే వదిలేసి పాఠశాలకు తలుపులు వేసి వెళ్లిపోయాడు. దీంతో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం సమయం వరకూ విషపురుగు తిరుగుతున్న ప్రదేశంలోనే గడిపారు. విద్యార్థులను నిర్లక్ష్యంగా వదిలేసి వెళ్లిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

రైతులపై భాష్పవాయువు ప్రయోగించడం సిగ్గుచేటు

గుంతకల్లు: పంటలకు మద్దతు ధరలు కోసం శాంతయుతంగా ర్యాలీ చేస్తున్న రైతులపై భాష్పవాయువు ప్రయోగించడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి మండిపడ్డారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి కార్పొరేట్ సంస్థలపై ఉన్న శ్రద్ధ రైతులపై ఏ మాత్రం లేదన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించడంతోపాటు స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ, రూరల్ అధ్యక్షులు ఎస్.గోపీనాథ్, రాముదాయల్, నాయకులు ఎస్ఎండీ గౌస్, రామాంజనేయులు, తలారి సురేష్, వినోద్, వెంకటనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

బుక్కరాయసముద్రం: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జేఎన్‌టీయూ సీఎస్ఈ రీసెర్చ్ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐటీఈ స్పాన్సర్డ్ ఏటీఏఎల్ ఆన్‌లైన్ సిక్స్ డేస్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం సైబర్ సెక్యూరిటీ ఎస్సెన్షియల్స్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు సాంకేతిక పరిజ్ఞానం పెరిగి పోతోందన్నారు. సాంకేతిక ప్రపంచంలో సైబర్ సెక్యూరిటీ ప్రాముఖ్యతను డిజిటల్ ఫోరెన్సిక్ పైపుణ్యతను పెంపొందించుకోవడం ఆవశ్యకతను అధ్యాపక బృందానికి వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వీర ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ సాయి చైతన్య కిషోర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శశికళ, కో కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ కుమార్ యాదవ్, రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ శోభా బిందు, ప్రొఫెసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతులు వేగవంతం


మరమ్మతులను పరిశీలిస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని చింతకుంట సమీపంలో సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరు చెరువుకు నీరు సరఫరా అయ్యే కాలువకు గండి పడటంతో అధికారులు మరమ్మతులను వేగవంతం చేశారు. మంగళవారం ఆర్డీఓ కేశవనాయుడు, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, డీఈ చంద్రశేఖర్ మరమ్మతులను పరిశీలించారు. పనులను త్వరితగిన పూర్తి చేసి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువును నింపాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆదేశించారు. కాలువ కల్వర్టు కింది భాగం కూలిపోవడంతో నీరు వృథా కాకుండా సాగర్ వద్ద షట్టర్లను దించి పనులను ప్రారంభించారు. తహసీల్దార్ శేషారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ

గుత్తి: అనంతపురం ఎస్కేయూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్ కళాశాలల అథ్లెటిక్ పోటీల్లో గుత్తి పీఆర్ఆర్ ఎంబీఏ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంబీఏ ఫైనలియర్ విద్యార్థి జై సాయి సుభాష్ ఏకంగా ఐదు మెడల్స్ సాధించి అథ్లెటిక్ మెన్ చాంపియన్ షిప్ సాధించాడు. ఇందులో రెండు గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్, ఒక బ్రాంజ్ మెడల్ ఉన్నాయి. అలాగే ఫస్టియర్ విద్యార్థిని త్రివేణి జావెలిన్ త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించింది. కళాశాలలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో జై సాయి సుభాష్, త్రివేణిని కళాశాల యాజమాన్యం అభినందించింది.


జై సాయి సుభాష్‌ను అభినందిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన


ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో గుంతకల్లు పద్మావతి ఆయుర్వేద ఆసుపత్రి, గుత్తి రైల్వే ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డీజిల్‌షెడ్ ఎండీఎంఈ సుంకన్న, డాక్టర్ జాన్సన్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ సెక్రెటరీ రవికుమార్, మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ నారాయణ, ఎస్ఎస్ఈ కృష్ణానాయక్, మనోజ్, వైద్యులు ప్రసాద్, శంకర్ మహాదేవ్, మల్లికార్జున, రాధిక, రాజేశ్వరి పాల్గొన్నారు.

నేటి నుంచి సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

గుత్తి రూరల్: మండలంలోని 24 గ్రామ పంచాయతీల సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై బుధ, గురువారాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ మంగళవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధ, గురు వారాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్‌లకు శిక్షణ ఉంటుందన్నారు.

ఘనంగా బీరప్ప స్వాముల ఊరేగింపు


బీరప్ప స్వాములు ఊరేగింపు దృశ్యం

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం గ్రామంలో కురబల ఆరాధ్య దైవం బీరప్ప స్వాములను మంగళవారం ఊరేగించారు. జిల్లాలోని బుక్కరాయసముద్రం, కల్లుమడి, అంతరగంగ, తాటిచెర్ల, చిన్నజలాలపురం తదితర గ్రామాల నుంచి వచ్చిన 10 బీరప్ప స్వాములను ఊరేగించారు. కార్యక్రమంలో మండలంలోని కురబలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జిల్లా జైలులో నేడు వేలం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జిల్లా జైలులో బుధవారం 25 వేల కేజీల వేరుశనగ చెక్కకు వేలం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంటరహ్మాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప రేంజ్ ప్రాంతీయ జైళ్ల ఉపశాఖ అధికారి సమక్షంలో వేలం నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.20,000 డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కి చెల్లిస్తామన్నారు.

హనుమాన్ మాలధారులకు గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు సమీపంలో మంగళవారం సాయంత్రం ఆటో ఢీకొని ముగ్గురు హనుమాన్ మాలధారులకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. తాడిపత్రి నుంచి కసాపురం ఆంజనేయస్వామి దర్శనానికి పాదయాత్రగా వెళుతున్న మాలధారులను ఆటో ఢీకొంది. ఘటనలో మాలధారులు చంద్ర, అజేయ్, మహేంద్రకు గాయాలయ్యాయి. వారిని వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న ఏసీడీపీఓ నాగమణి

గుత్తి: 'అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. సమయపాలన పాటించని కార్యకర్తలు, ఆయాలపై చర్యలు తప్పవు' అని ఏసీడీపీఓ నాగమణి హెచ్చరించారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని దాసరి కాలనీ, జెండా వీధి అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లలకు సంబంధించిన రికార్డుల పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి ఉంచాలన్నారు. సమయపాలన తప్పకుండా పాటించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఏఈ మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. యర్రగుంట్ల సబ్ స్టేషన్ పరిధిలోని రైతులు గమనించి సహకరించాలన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడి మృతి

తాడిపత్రి అర్బన్: పెన్షనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం తాడిపత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. తాడిపత్రి పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా ఆయన పదేళ్లకుపైగా ఎనలేని సేవలు చేయడంతోపాటు ఎన్నో సామాజిక కార్యక్రమాలను చేపట్టి సంఘానికి మంచి పేరు తెచ్చారని సభ్యులు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు క్రాస్‌లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగనాయకులు (35) అనే వ్యక్తికి గాయాలయ్యాయని ఏఎస్ఐ శ్రీధర్ తెలిపారు. సమీప ఫ్యాక్టరీలో పనిచేస్తున్న రంగనాయకులు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన మోటర్ సైకిల్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వీరాపురంలో డీఎస్పీ పర్యటన

తాడిపత్రి రూరల్ : మండలంలోని ఫ్యాక్షన్ గ్రామం వీరాపురాన్ని మంగళవారం రాత్రి డీఎస్పీ రామకృష్ణుడు, అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తనిఖీ చేశారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన ఘర్షణల్లో భాస్కర్‌రెడ్డి హత్యకు గురయ్యాడు. ప్రతీకార దాడులు జరుగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కొనసాగుతున్న పికెటింగ్‌ను సీఐ తనిఖీ చేశారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

13న హనుమజ్జయంతి

యల్లనూరు: మండలంలోని చిలమకూరు ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఈనెల 12, 13న నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు బాలాజీ స్వామి మంగళవారం తెలిపారు. 12న స్వామికి ప్రత్యేక పూజలు, మహామంగళహారతి, తీర్థ ప్రసాదాలు, 13న వేకువజామున నుంచి హనుమాన్ స్వామికి అభిషేకం, హోమం, ఆకుపూజ, మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు అనంతరం వృషభ రాజుల పోటీలు ఉంటాయన్నారు. శుక్రవారం రాత్రి పంచమాంకములు నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. హనుమాన్ జయంతిని విజయవంతం చేయాలని సర్పంచ్ పెద్దనాగరాజు కోరారు.

మట్కా బీటర్ల అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని సజ్జలదిన్నె వద్ద మంగళవారం రాత్రి ఇద్దరు మట్కా బీటర్లను అరెస్టు చేశామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి సజ్జలదిన్నె గ్రామానికి చెందిన షేక్ మహబుబ్‌బాషా, షేక్ చిన్న హాజీవలిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.25 వేలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.